సాక్షి ప్రకాశం

బుధవారం । 31 । జనవరి । 2024



రాష్ట్రంలో మహిళా సంక్షేమ విప్లవం

సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - 8లో..



సాధనతోనే విజయం సొంతం

ఉన్నత శిఖరాలు చేరుకునేందుకు విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, విజయానికి సాధన చేయాలని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి చదరంగ పోటీల్లో ఆముక్త సత్తా



చదరంగ పోటీల్లో తలపడుతున్న విద్యార్థిని ఆముక్త

ఒంగోలు: స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఆముక్త జాతీయ స్థాయి చదరంగ పోటీల్లో పాల్గొని రూ.25 వేల నగదు బహుమతిని కైవసం చేసుకుంది. అండర్ 15 జాతీయ స్థాయి బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు మహారాష్ట్రలోని జలగాంలో జరిగాయి. ఈమె ఈ పోటీల్లో పాల్గొని 6వ స్థానంలో నిలిచి ఈ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విజయంతో ఈ ఏడాది జరిగే ఏషియన్ యూత్ చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించింది.

జాతిపిత చూపిన మార్గం అనుసరణీయం

● జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత

ఒంగోలు అర్బన్: జాతిపిత మహాత్మ గాంధీ చూపిన సత్యం, అహింస మార్గంలో ప్రతి ఒక్కరూ అనుసరించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) ఆర్ శ్రీలత అన్నారు. మంగళవారం మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక గాంధీరోడ్డులోని గ్రామ చావిడి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అహింస, సత్యంతో ఏదైనా సాధించవచ్చని దేశానికి స్వాతంత్ర్యం సాధించి చూపిన మహనీయుడని కొనియాడారు. దీనిలో ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఒంగోలు తహశీల్దార్ మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షునిగా కత్తి ఐజాక్

ఒంగోలు: మాదిగ ఉద్యోగుల సంఘం ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా కత్తి ఐజాక్ ఎంపికయ్యారు. తాజాగా రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు, జాతీయ ఉపాధ్యక్షుడు బొంతా ఏసుదాసు సమక్షంలో ఎంపిక నిర్వహించి, ఎంపిక జాబితాను మంగళవారం మీడియాకు విడుదల చేశారు. గౌరవ అధ్యక్షునిగా ఎస్.రవి రాజ్‌కుమార్, గౌరవ సలహాదారులుగా కేఎస్ ప్రకాశరావు, తాతపూడి సుకుమార్, టీపీ దేవ ప్రభాకర్, పీ.వీరాస్వామిలతోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మర్రి మోషే, ప్రధాన కార్యదర్శిగా తాళ్లూరి శేషయ్య, అదనపు ప్రధాన కార్యదర్శిగా లక్కెనబోయిన కోటేశ్వరరావు, కోశాధికారిగా తేళ్ల జాలారావుతోపాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

హెడ్ నర్సులకు పదోన్నతి

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో హెడ్ నర్సులుగా పనిచేస్తున్న ఐదుగురికి మంగళవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో పదోన్నతి కౌన్సిలింగ్ నిర్వహించి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా ప్రమోషన్ ఇచ్చారు. గుంటూరు జీజీహెచ్‌లో హెడ్‌నర్సులుగా పనిచేస్తున్న సీహెచ్.కమలకుమారి, కె.గ్లాడిస్ వియోలా, నున్నా ఇందిరాదేవిలకు ప్రమోషన్ ఇచ్చి గుంటూరు జీజీహెచ్‌లోనే గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా పోస్టింగ్ ఇచ్చారు. ఒంగోలు జీజీహెచ్‌లో పనిచేస్తున్న సీహెచ్.అనంతలక్ష్మికి ఒంగోలు జీజీహెచ్‌లో, నెల్లూరు ఏసీఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న వి.మల్లేశ్వరికి ఒంగోలు జీజీహెచ్‌లో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా పోస్టింగ్ ఇచ్చారు. ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ నాగూర్ షరీఫ్ కౌన్సిలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు.

పలువురు సీఐలు బదిలీ

ఒంగోలు టౌన్: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాల్‌రాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీసీఆర్ లో ఉన్న ఓ.దుర్గా ప్రసాద్‌ను చీమకుర్తి యూపీఎస్‌కు బదిలీ చేశారు. గుంటూరు వీఆర్ లో ఉన్న దాసరి వెంకటేశ్వరరావును కనిగిరి సర్కిల్, గుంటూరు వీఆర్‌లో ఉన్న కె.రాములు నాయక్‌ను యర్రగొండపాలెం సర్కిల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. యర్రగొండపాలెం సీఐ కె.మారుతి కృష్ణను గుంటూరు రేంజి వీఆర్‌కు పంపారు.

పశ్చిమాన ఆరోగ్యఖిల్లా..!

ఒకప్పుడు పశ్చిమ ప్రకాశం వాసులకు వైద్యం అందక నానా అగచాట్లు పడేవారు. చిన్నపాటి రోగమొచ్చినా పొరుగు జిల్లాలకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి. నాటి టీడీపీ ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. సకాలంలో వైద్యం అందక పేదల ప్రాణాలు గాల్లో కలసిపోయేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది. పశ్చిమాన వైద్యసేవలు విస్తృతమయ్యాయి. పేదలకు మెరుగైన వైద్యసేవలందించే దిశగా అడుగులు పడుతున్నాయి. మార్కాపురం జిల్లా ఆస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. ప్రైమరీ, అర్బన్ హెల్త్‌సెంటర్లను ప్రభుత్వం పటిష్టం చేసింది.

- విస్తృతంగా పేదలకు వైద్యసేవలు
- అందుబాటులో అత్యాధునిక వైద్యం
- 27 ప్రైమరీ హెల్త్ సెంటర్ల ఏర్పాటు
- 5 అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటు
- 58 మంది వైద్యుల సేవలు అందుబాటులో
- 7.34 లక్షల మంది ప్రజలకు సేవలు
- అందుబాటులో 64 రకాల పరీక్షలు



మార్కాపురంలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

మార్కాపురం: టీడీపీ ప్రభుత్వం పశ్చిమ ప్రకాశాన్ని చిన్నచూపు చూసింది. ప్రధానంగా వైద్యారోగ్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. డాక్టర్లు, మందుల కొరతతో ప్రజల ప్రాణాలకు భరోసా లేకుండా పోయింది. పట్టణ ఆరోగ్య కేంద్రాలకు అనారోగ్యం ఆవహించింది. ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పోయింది. దీంతో రోగులు పొరుగు జిల్లాలోని ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉండేది. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం ద్వారా వైద్యశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. డాక్టర్ల నియామకానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. అత్యాధునిక వైద్యసేవలు సైతం అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో కోటి రూపాయల వ్యయంతో అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అన్ని రకాల పరీక్షలు చేసేందుకు ఆధునిక వైద్య పరికరాలతో పాటు మందుల కొరత లేకుండా చూస్తున్నారు. దీంతో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి.

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరుల్లో 5 అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో మార్కాపురంలో 3, గిద్దలూరులో 2 అర్బన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో, పూల సుబ్బయ్య కాలనీ, జవహర్ నగర్ కాలనీల్లో దాదాపు ఒక్కొక్కటి కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటయ్యాయి. దీని వల్ల ప్రజలకు వైద్య సేవలు ఇంటి ముంగిటకే వచ్చాయి. ఏ ప్రాంతం వారు ఆ ప్రాంతంలో వైద్యశాలకు వెళ్లి డాక్టర్ల సేవలు పొందుతున్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్ ఎస్టేట్, ఏకలవ్యకాలనీ, డ్రైవర్స్ కాలనీ, దొడ్డవారి బజార్, రేడియోస్టేషన్ తదితర ప్రాంతాల్లో నివసించే సుమారు 5 వేల మంది ప్రజలకు ఉపయోగంగా ఉంది. పీఎస్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు పీఎస్ కాలనీ, బాపూజీ కాలనీ, ఎస్సీ, బీసీ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, కొండారెడ్డి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, చెన్నరాయుడు పల్లి ప్రాంతాల ప్రజలు, జవహర్‌నగర్ కాలనీలోని హెల్త్ సెంటర్‌కు టీచర్స్ కాలనీ, జేఎస్ కాలనీ, సాయి నగర్ తదితర ప్రాంతాల ప్రజలు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు.

వైద్య పరీక్షలు ఇలా..

అర్బన్ హెల్త్ సెంటర్లలో 61 రకాల వైద్య పరీక్షలు అందుతున్నాయి. ఇందులో షుగర్, కిడ్నీ, లివర్, మలేరియా, డెంగీ, వైరల్, రక్తకణాలు, హిమోగ్లోబిన్, కామెర్లు, సోడియం, పొటాషియం, సీరం క్రియాటిన్, యూరిక్ యాసిడ్, కొలెస్ట్రాల్, హెచ్‌డీఎల్, ఎల్‌డీఎల్ తదితర ప్రధాన పరీక్షలు నిర్వహిస్తారు. బీపీ, షుగర్‌తో పాటు కుక్క, పాము కాటులకు కూడా మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రతి బుధ, శనివారాల్లో చిన్నారులకు వ్యాక్సినేషన్ చేస్తారు. రోజుకు 90 నుంచి 100 పేషెంట్లు సేవలు పొందుతున్నారు. అర్బన్ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లతో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు.

పశ్చిమ ప్రకాశంలో ఇలా..

మొత్తం మండలాలు	: 13
ప్రైమరీ హెల్త్ సెంటర్లు	: 27
అర్బన్ హెల్త్ సెంటర్లు	: 05
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	: 02
జిల్లా వైద్యశాల	: 01
మెడికల్ ఆఫీసర్లు (గ్రామీణ)	: 53
మెడికల్ ఆఫీసర్లు (పట్టణం)	: 05
వైద్యసేవలందే గ్రామాలు	: 560
వైద్యసేవలు పొందే ప్రజలు	: 7.34 లక్షలు
హెల్త్ క్లినిక్‌లు	: 177
104 వాహనాలు	: 15
తల్లీ బిడ్డ వాహనాలు (102)	: 06
ట్రైబల్ పీహెచ్‌సీలు	: 11
వీధి నిర్వహణలో ఉన్న ఏఎన్ఎంలు	: 262
స్టాఫ్ నర్సులు (గ్రామీణ, పట్టణ)	: 91
ఆశా వర్కర్లు	: 674
రోజుకు ఓపీలు (సగటున)	: 90 నుంచి 100



పరీక్ష చేస్తున్న డాక్టర్ శ్రావణ్‌తేజ

సేవలు ఉపయోగించుకోండి



పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలి. గత ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు కోటి రూపాయలు మంజూరు చేయడంతో పట్టణ నడిబొడ్డున సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించాం. డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

– కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే

64 రకాల వైద్య పరీక్షలు



అర్బన్ హెల్త్ సెంటర్లలో 64 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రజలు డాక్టర్ల సేవలను ఉపయోగించుకోండి. ఎక్కడా మందుల కొరత లేదు. మంచి వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. పట్టణ ప్రజలు వీరి సేవలు పొందొచ్చు. సాధారణ జబ్బులతో పాటు షుగర్, బీపీకి కూడా మందులు ఇస్తారు. ఇంకా ఆరోగ్య శ్రీ పరిధిని రూ.5 నుంచి రూ.25 లక్షల వరకూ పెంచారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో కూడా ఉచిత వైద్యసేవలు పొందవచ్చు. ప్రతి బుధ, శని వారాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. అర్బన్ హెల్త్ సెంటర్లలో రోజుకు 90 నుంచి 100 మంది ఓపీ విభాగంలో పేషెంట్లు వస్తున్నారు.

– డాక్టర్ పద్మావతి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ, మార్కాపురం

మంచి సేవలు అందుతున్నాయి



నా పేరు చెన్నకేశవులు. నేను పట్టణంలోని వాటర్ ట్యాంకు వద్ద నివాసముంటున్నాను. కూలి పనిచేసుకుంటున్నాను. రెండు రోజుల నుంచి ఒంట్లో బాగోలేకుంటే సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్‌కు వచ్చాను. ఇక్కడ డాక్టరు, సిబ్బంది బాగా చూశారు. మందులు ఉచితంగా ఇచ్చారు. అన్ని రకాల పరీక్షలు చేశారు. బీపీ, షుగర్‌కు మందులు ఇస్తున్నారు.

– చెన్నకేశవులు, మార్కాపురం పట్టణం.

వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయాలి

- రాష్ట్ర మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- కొండపిలో నాయకులు, కార్యకర్తల సమావేశం



కొండపిలో మాట్లాడుతున్న మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్

కొండపి (టంగుటూరు): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలి, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. కొండపిలోని శ్రీ సీతారామ ఫంక్షన్ హాల్‌లో కొండపి మండల నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించగా ముఖ్య అతిథిగా మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా ఒక్క రూపాయి కూడా లంచానికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందిస్తున్నారని చెప్పారు. కొండపి నియోజకవర్గంలో జగనన్న ప్రభుత్వంలో జగనన్న సురక్ష, ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని దోచుకున్నారు:

కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య కొండపి నియోజకవర్గంలో ప్రజలకు అందాల్సిన సొమ్మును జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారని మంత్రి సురేష్ విమర్శించారు. పింఛను ఇవ్వాలన్నా, ప్రభుత్వ పథకాలు అందాలన్నా, అర్హులకు ప్రభుత్వ బ్యాంకు లింకేజీ లోన్లు ఇవ్వాలన్నా లంచాలు దండుకున్నారన్నారు. కొండపి నియోజకవర్గంలో టీడీపీ హయాంలో నీరు -చెట్టు పేరుతో ప్రభుత్వ ధనాన్ని దోచుకున్నారన్నారు. ప్రజలు మంచికి, చెడుకు తేడా గమనిస్తున్నారని, టీడీపీకి ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, జెడ్పీటీసీ మారెడ్డి అరుణరెడ్డి వెంకట్రాద్రిరెడ్డి, పార్టీ రాష్ట్ర సెక్రటరీ డాకా పిచ్చిరెడ్డి, గుర్రపడియ సర్పంచి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, దివి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొక్కసం ఉపేంద్ర, సర్పంచి భువనగిరి సత్యం పంతులు, మండల యువత అధ్యక్షుడు రాజీవ్‌చౌదరి, వైస్ ఎంపీపీ వేముల ప్రసాద్, నాయకులు బొక్కసం సుబ్బారావు, కోటి, గర్నిపూడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ వెంటే బీసీలంతా

● వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి బొట్ల రామారావు



బొట్ల రామారావు

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే బీసీలంతా ఉన్నారని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి బొట్ల రామారావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీసీలను మభ్యపెట్టడం, అనంతరం మోసం చేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. 2014 ఎన్నికలకు ముందు 119 హామీలను జనాలకు చంద్రబాబు ప్రకటించారని, మరీ ముఖ్యంగా బీసీ డిక్లరేషన్ పేరుతో 24 హామీలను ప్రకటించి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. బీసీ అధికారులను తోకలు కత్తిరిస్తామని హెచ్చరించడం, నాయకుల పట్ల అమానుషంగా వ్యవహరించడం బీసీలు మరువలేని చరిత్ర అన్నారు. 100 సీట్లు అసెంబ్లీలో బీసీలకు కేటాయించేందుకు బీసీలను మాత్రమే సంబంధిత స్థానాల్లో పోటీపెట్టేందుకు సిద్ధంకండి అంటూ అప్పటి వైఎస్సార్‌సీపీ గౌరవ అధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ సవాల్ విసిరితే పత్తాలేకుండా పోయిన చరిత్ర చంద్రబాబుది అన్నారు. ఆదరణ పథకం పేరుతో నాణ్యత లేని ఇస్త్రీపెట్టెలు, సైకిళ్లు, పాల క్యాన్లు ఇచ్చి దారుణంగా మోసం చేశారన్నారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ అధ్యయన కమిటీ వేయడమే కాకుండా వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బీసీ పనిముట్లతో ఒక ప్రత్యేక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారన్నారు. బీసీలకు ఏం చేయాలనే దానిపై అవగాహన కలిగి ఉండడమే కాకుండా సీఎం అయిన తరువాత బీసీలకు ప్రత్యేక పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తూ చరిత్ర సృష్టించారన్నారు. ఏటా రూ.పదివేల కోట్లు బీసీలకు కేటాయిస్తానని చెప్పి ఐదేళ్లలో రూ.50 వేల కోట్లకుగాను కేవలం రూ.18 వేల కోట్లు మాత్రమే ఖర్చుచేసి చంద్రబాబు బీసీలను వంచించారన్నారు. బీసీలకు చట్టసభలో 50 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని రాజ్యసభలో విజయసాయిరెడ్డి ప్రైవేటు బిల్లు ప్రవేశపెడితే టీడీపీ కనీసం మద్దతు కూడా పలకకుండా తమ నైజాన్ని చాటుకున్నారని విమర్శించారు. ఒక వైపు బీసీ జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చంద్రబాబు ఓసీలను నిలబెడుతుంటే, జగన్ మాత్రం ఓసీలకు గతంలో కేటాయించిన స్థానాల్లో బీసీలను నిలబెడుతూ బీసీ పక్షపాతిగా నిలుస్తున్నారన్నారు. పేదరికాన్ని రూపుమాపాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టిన సీఎం జగన్ చిత్తశుద్ధిని అర్థం చేసుకుని బీసీలంతా మోసకారి చంద్రబాబుకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధం



హాజరైన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు



మాట్లాడుతున్న ఆర్ఐవో సైమన్ విక్టర్

● ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్

ఒంగోలు: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. స్థానిక ఆంధ్రకేసరి విద్యాకేంద్రం ఆవరణలో మంగళవారం ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణపై ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 2న ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు నైతికత, మానవ విలువలు, 3వ తేదీ పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ రెండు పరీక్షలు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులు వారు చదివే కాలేజీలోనే తప్పనిసరిగా రాయాల్సి ఉంటుందన్నారు. గతంలో విద్యాభ్యాసం చేసి పరీక్షలకు గైర్హాజరై ఉంటే వారు కూడా రాయవచ్చని చెప్పారు. ఒకేషనల్ కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు మూడు విడతల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో మొత్తం 46 జూనియర్ కాలేజీల్లో ఈ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా పరీక్షలు ఉంటాయన్నారు. ప్రథమ సంవత్సరం 2395 మంది, ద్వితీయ సంవత్సరం 2501 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు ఎగ్జామినర్లను ఇంటర్ బోర్డు నియమిస్తుందని చెప్పారు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జనరల్ కోర్సులైన ఎంపీసీ, బైపీసీ రెండో సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 11 నుంచి 20వ తేదీ వరకు రెండు విడతల్లో నిర్వహించాలన్నారు. 50 మందికి తక్కువగా ఉన్న పక్షంలో ఆ కాలేజీ విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రానికి కేటాయిస్తారని, అనుభవం ఉన్న సైన్స్ అధ్యాపకులను బోర్డు నియమిస్తుందని చెప్పారు. సైన్స్ ప్రాక్టికల్స్‌లో భాగంగా మైనర్ సబ్జక్టుగా ఉన్న జాగ్రఫీ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రంగా గిద్దలూరు ఎస్వీ జూనియర్ కాలేజీని ఎంపిక చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలకు 13827 మంది హాజరుకావాల్సి ఉందన్నారు. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం థియరీ ఒకేషనల్, జనరల్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలోని జూనియర్ కాలేజీలో తాగునీరు, ఫర్నిచర్, టాయిలెట్లు, సీసీ కెమెరాలు, భద్రత వంటి సదుపాయాలతో పరీక్షల నిర్వహణలో సమర్థతను చాటిన, గతంలో ఎటువంటి సమస్య వ్యక్తంకాని 69 కాలేజీలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారన్నారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు టాస్క్‌ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమిస్తారని, పరీక్షలను నియమ నిబంధనలతో కట్టుదిట్టంగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలను వివరించారు. సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు అయిన కె.ఆంజనేయులు, కె.స్వరూపారాణి, జి.మనోహర్‌రెడ్డి, జిల్లా ఇంటర్ విద్య అధికారి ఐ.శ్రీనివాసరావు తదితరులు పలు సూచనలు చేశారు. నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం కనిపించినా ఆయా కాలేజీలు, సిబ్బందిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టోల్ ప్లాజా వద్ద రూ.కోటి స్వాధీనం

టంగుటూరు: టోల్ ప్లాజా వద్ద ఒక కారులో తరలిస్తున్న పెద్ద మొత్తంలో నగదును టంగుటూరు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వరరావు తన సిబ్బందితో టంగుటూరు టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేస్తున్నారు. చెన్నై నుంచి గుంటూరుకు వెళ్తున్న ఇన్నోవా వాహనాన్ని తనిఖీ చేశారు. బ్యాగులో పెద్ద మొత్తంలో నగదును పోలీసులు గుర్తించారు. పోలీసులు కారులో ముగ్గురు వ్యక్తులను విచారించగా సరైన సాక్ష్యాధారాలు చూపలేకపోవడంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. రామస్వామి ప్రతాప్, సాకత్ ఆలీ ఫరాక్ అబ్దుల్లా, మనీ పరమశివ అనే వ్యక్తులు చెన్నైకి చెందిన మాధవ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో పని చేస్తున్నారని గుర్తించారు. సంస్థ నిర్వాహకులు బాలాజీ కాపా గతంలో తమిళ సినిమాలను సైతం తీశారు. వీరంతా సంస్థలో అసిస్టెంట్ మేనేజర్లుగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరుకు చెందిన వారికి రూ.కోటి నగదు ఇచ్చి రావాలని బాలాజీ సూచించటంతో తామంతా బయలుదేరామని వారు పోలీసులకు తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి సరైన ధ్రువపత్రాలు చూపక పోవటంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగదును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన నగదును విజయవాడ ఆదాయపన్ను శాఖ కార్యాలయానికి తరలిస్తున్నట్లు సమాచారం.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఒంగోలు సిటీ: జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కింద రిజిస్ట్రేషన్ చేసుకోని వారు ఉంటే రానున్న ఏడు రోజుల్లో చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ఎస్.రాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని చిన్న (రక్త పరీక్షలు), పెద్ద లాబ్స్ (అన్ని రక్తపరీక్షలు, ఎక్సరే, సిటీస్కాన్, యం.ఆర్.ఐ), డయోగ్నోస్టిక్ సెంటర్స్ అన్నీ తాము ఇచ్చే రిపోర్ట్సు పై డాక్టరు లేదా పెతాలజిస్టుచే ధ్రువీకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కింద 49 లాబ్స్ ఆన్‌లైన్ చేయించుకున్నారని తెలిపారు. అన్ రిజిస్టర్ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కిందద ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఆసుపత్రి కానీ లాబ్స్, డయోగ్నోస్టిక్ సెంటర్స్ కానీ నిర్వహిస్తున్నట్లు తెలిసినా, అధికారుల విచారణకు వచ్చినపుడు సరైన పత్రాలు చూపించకపోయినా వాటిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి
- ముండ్లమూరులో డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా రూ.7 కోట్ల చెక్కు అందజేత
- రుణమాఫీ పేరుతో మహిళలు, రైతులకు చంద్రబాబు కుచ్చు టోపీ పెట్టాడని ధ్వజం
- ఓటమి భయంతోనే జగనన్న ప్రభుత్వంపై బురదజల్లుతు న్నారని మండిపాటు


వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

రాష్ట్రంలో మహిళా సంక్షేమ విప్లవం

ముండ్లమూరు: సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి సరికొత్త చరిత్ర సృష్టించారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, మహిళలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేసి మహిళా సంక్షేమ విప్లవానికి నాంది పలికారని కొనియాడారు. ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం డ్వాక్రా మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.7 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, నాడు-నేడు, జగనన్న కాలనీలు, వైఎస్సార్ ఆసరా, చేయూత లాంటి 32 పథకాలు, కార్యక్రమాలను ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారన్నారు. పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. డ్వాక్రా సంఘాలకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణమాఫీ కావడంతో ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన వ్యవస్థలకు సీఎం వైఎస్ జగన్ జవసత్వాలు ఊదారని పేర్కొన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బూచేపల్లి సుబ్బారెడ్డి, వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, రానున్న ఎన్నికల్లో నా బిడ్డ శివప్రసాదరెడ్డిని గెలిపించాలని వెంకాయమ్మ విజ్ఞప్తి చేశారు. ఎవరికి ఏ అవసరం ఉన్నా మా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని చెప్పారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి కుటుంబ సభ్యులను డ్వాక్రా మహిళలు గజమాలతో సత్కరించారు. మండల కేంద్రంలో మహిళల సమావేశాలకు భవనం కావాలని కోరగా వీలైనంత త్వరలో ఏర్పాటు చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు.

ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు విజన్

40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే నారా చంద్రబాబు ప్రజలను మోసం చేయడమే తన విజన్‌గా మార్చుకున్నారని వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఎద్దేవా చేశారు. రుణమాఫీ పేరుతో రైతులు, మహిళలకు కుచ్చుటోపీ పెట్టిన చరిత్ర చంద్రబాబుదని ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ, జనసేన నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తూ డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. జన్మభూమి కమిటీలతో అనుకూల వర్గాలకు లబ్ధి చేకూర్చడం, దళారులను పెంచి పోషించడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదని నిప్పులు చెరిగారు. 600 హామీలను అమలు చేయకుండా మోసం చేసిన చంద్రబాబు.. మీ ముందుకు వస్తే చెంప చెల్లుమనిపించాలన్నారు.

కార్యక్రమంలో శివప్రసాద్‌రెడ్డి సతీమణి నందిని, ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, కాపా రమణారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీలు బంకా రమణమ్మనాగిరెడ్డి, వేముల పద్మ జానకిరామయ్య, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ శంకరరావు, వైఎస్సార్‌కెపి దర్శి క్లష్టర్ ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి, ఎంపీటీసీ సభ్యులు గుణపాటి వెంకటేశ్వరరెడ్డి, తేలుకుట్ల బ్రహ్మం, సర్పంచ్‌లు కందిమల్ల గీతాంజలి, జనమాల నాగేంద్రం, వేముల శ్రీను, గోపనబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు భిక్షాలురెడ్డి, పాలడుగు చిరంజీవి, నలగట్ల ఈశ్వరాచారి, బిజ్జం కృష్ణారెడ్డి, మేదరమెట్ల కోదండరామయ్య, అంజిరెడ్డి, గోపనబోయిన శ్రీనివాసరావు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సభకు భారీగా హాజరైన మహిళలు

సాధనతోనే విజయం సొంతం

- రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్
- కొండపిలో 10వ తరగతి విద్యార్థులకు విజయ సాధన అవగాహన సదస్సు


కొండపిలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

కొండపి(టంగుటూరు): జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకునేందుకు విద్యకు అధిక ప్రాముఖ్యత ఇవ్వాలని, విజయానికి సాధన చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ఉద్బోధించారు. మంగళవారం కొండపిలోని సీతారామ ఫంక్షన్ హాల్లో పదో తరగతి విద్యార్థులకు విజయ సాధన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొండపి, పొన్నలూరు, మర్రిపూడి మండలాల్లో 10వ తరగతి చదువుతున్న సుమారు 2 వేల మందికిపైగా విద్యార్థులకు మంత్రి ఆదిమూలపు సురేష్ తన సొంత నిధులు సుమారు రూ.5 లక్షలతో రూపొందించిన స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, చదువుపై శ్రద్ధ చూపాలని సూచించారు. పోటీ ప్రపంచంలో విద్యలో రాణించేందుకు కఠోర సాధన చేయాలని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని విద్యార్థులకు వివరించారు. పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, వనరులను వినియోగించుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈఓ సుబ్బారావు, జెడ్పీటీసీలు బెజవాడ వెంకటేశ్వర్లు, మారెడ్డి అరుణకుమారిరెడ్డి, కొండపి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగం, జేసీఎస్ మండల కన్వీనర్ గొట్టిపాటి మురళి, కొండపి, పొన్నలూరు, మర్రిపూడి ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అవగాహన సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

టంగుటూరు: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు టంగుటూరు మండలం జమ్ములపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ సురేంద్రరెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక చిన్న గ్రామంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఎంతో మంది రాష్ట్ర స్థాయి క్రీడాకారులను తయారు చేస్తున్న పీడీ తుల్లిబిల్లి అశోక్‌బాబును ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో మొదటి బహుమతి నెల్లూరు, రెండో బహుమతి చిత్తూరు, మూడో బహుమతి ప్రకాశం క్రీడాకారులు కైవసం చేసుకున్నారని రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సురేష్ తెలిపారు.



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సురేంద్రరెడ్డి

ఏకేయూ క్యాంపస్ అభివృద్ధికి సహకారం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున


మంత్రి మేరుగు నాగార్జునను సత్కరిస్తున్న ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి తదితరులు

ఒంగోలు: పేర్నమిట్టలోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ క్యాంపస్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, రిజిస్ట్రార్ హరిబాబుతోపాటు పలువురు ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తాను అన్ని విధాలా సహకరిస్తానన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జునకు యూనివర్శిటీ డైరీ, క్యాలెండర్‌ను అందించి, విశ్వవిద్యాలయం గురించి వివరించారు. యూనివర్శిటీ పాలకమండలి సభ్యులు డాక్టర్ కేవీఎస్ రాజు, సుమతితోపాటు పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

L.M.K High School
6th ward, Kanigiri - 523230 (Prakasam Dist)

పత్రికా ప్రకటన

CC No. 810 of 2020 in WP No.3728 of 2019 dated: 25.3.2019 GOMS No.1 Dt.01.01.1994 ప్రకారం దిగువ కనపరచిన ఖాళీ ఎయిడెడ్, టీచర్ పోస్టులు భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది. అభ్యర్థులు రాష్ట్రంలోని ఏదైనా ఎంప్లాయిమెంట్ కార్యాలయము నందు విధిగా తమ పేరు నమోదు చేసుకొని ఉండవలెను. TET క్వాలిఫై అయ్యి ఉండవలెను. GOMS No.38 of స్కూల్ ఎడ్యుకేషన్ (ఎగ్జామ్స్) డిపార్ట్‌మెంట్ Dated: 19.11.2014 అనుసరించి విద్య అర్హతలు కలిగి ఉండవలెను.

ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపు దరఖాస్తులను కరస్పాండెంట్ గారికి రిజిష్టరు పోస్టు ద్వారా పంపవలసినదిగా కోరడమైనది. ఈ ప్రకటన జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో జారీ చేయబడినది.

కనబరిచిన ఖాళీలు:

స్కూల్ అసిస్టెంట్ సైన్స్ - OC - 01 Gr-1 హిందీ పండిట్ - OC - 01
సెకండరీ గ్రేడ్ టీచర్ - OC - 01 సెకండరీ గ్రేడ్ టీచర్ - BCA - 01

ఇట్లు : కరస్పాండెంట్

శ్రీ వల్లూరమ్మ దేవస్థానము - వల్లూరు
టంగుటూరు మండలం - ప్రకాశం జిల్లా.

ఈ - ప్రొక్యూర్‌మెంట్, సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం కొరకు ప్రకటన

టెండర్ నోటీస్ నెం. నిల్/2024 తేది. 30-01-2024

ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, వల్లూరు గ్రామము నందు వేంచేసియున్న శ్రీ వల్లూరమ్మ దేవస్థానమునకు సంబంధించిన ఈ క్రింద తెలియపరచిన వివిధ బిటములకు ది.01-04-2024 నుండి ది.31-03-2025 వరకు నడుపుకొను హక్కులను పొందుటకు గాను బహిరంగ వేలం, సీల్డు టెండర్ మరియు ఈ -ప్రొక్యూర్‌మెంట్ ద్వారా తేది.12-02-2024 ఉదయం గం॥ 11-00 లకు కార్యనిర్వహణాధికారి కార్యాలయము, శ్రీ వల్లూరమ్మ వారి దేవస్థానము, వల్లూరులో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం, సీల్డు టెండర్ మరియు ఈ-ప్రొక్యూర్‌మెంట్ జరుపబడును.

వ. నెం.	పాటకు పెట్టబడు బిటము వివరములు	పాటకు ముందు చెల్లించవలసిన ధరావత్తు
1.	భక్తులచే సమర్పించబడు కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకొను హక్కు (ఈ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	50,000-00
2.	భక్తులచే సమర్పించబడు తలనీలాలు నాయీ బ్రాహ్మణుల ద్వారా క్షుర ఖర్మ చేసిన తలనీలాలు ప్రోగుచేసుకొను హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	25,000-00
3.	దేవాలయమునకు వచ్చు భక్తుల పాదరక్షలను భద్రపరిచెడి హక్కు మరియు గోరింటాకు ముద్రలు వేయు హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం) సూచన పాదరక్షల క్రింద రుసుమును జత 1కి రూ.3/-లు మాత్రమే వసూలు చేయవలెను.	25,000-00
4.	పార్కింగ్ ఫీజు, టాయిలెట్ ఫీజు వసూలు హక్కు సూచన టాయిలెట్లుకు రిపేర్లు వచ్చినచో హెచ్చుపాట దారుడే తన స్వంత ఖర్చులతో మరమత్తులు చేయించుకొనవలెను. (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	25,000-00
	ఉత్తరము నుండి దక్షిణమునకు గల షాపులు	
5.	షాపు నెం.1,2,3,4ల యందు (ఒకే షాపుగా) పూజా ద్రవ్యములు అమ్ముకొను హక్కు (ఈ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	1,00,000-00
6.	షాపు నెం.5లో కూల్ డ్రింక్స్ మరియు ఐస్‌క్రీమ్ పార్లల్ నడుపుకొను హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	25,000-00
7.	షాపు నెం.6,7,8,లలో (ఒకే షాపుగా) సస్టయి సామాగ్రి అద్దెకిచ్చుషాపు నడుపుకొను హక్కు (ఈ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	50,000-00
8.	షాపు నెం.9లో మండలపాలలంరణ మరియు ఎలక్ట్రికల్ డెకొరేషన్ ఏర్పాటు చేయు హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	25,000-00
9.	షాపు నెం.10లో వంట సరకులు అమ్మకొను షాపు నడుపుకొను హక్కు (పూజాసామగ్రి చేతిదారములు, వాహనమునకు కట్టుకొను తాళ్ళు వస్త్రములు అమ్మకూడదు) (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	10,000-00
10.	షాపు నెం.12లో ఆటబొమ్మలు అమ్ముకొను హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	10,000-00
11.	షాపు నెం.13,14,15లలో (ఒకే షాపుగా) క్యాంటీన్ నడుపుకొను హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	20,000-00

టెండర్ షెడ్యూలు జారీ చేయు తేదీలు :
ది.02-02-2024 నుండి ది.11-02-2024 సా॥ 5-00ల వరకు
టెండర్ షెడ్యూలు దాఖలు చేయు ఆఖరు తేది. 12-02-2024 ఉ॥ 9.00 వరకు
టెండర్ తెరచు తేది: 12-02-2024 ఉ॥ 11.00 లకు, టెండర్ షెడ్యూల్ ఖరీదు రూ.500/-

ఈ-ప్రొక్యూర్‌మెంట్ బిడ్ డౌన్‌లోడ్ మొదలు తేది. 02-02-2024 ఉ॥10.00లకు బిడ్ స్వీకరించు చివరి తేది. 11-02-2024 సా॥ 5.00ల వరకు బిడ్ తెరచు తేది: 12-02-2024 ఉ॥ 11.00 లకు పూర్తి వివరములకు www.apeprocurement.gov.in Endowments department marketing నందు చూడగలరు.

వల్లూరు
తేది: 30-01-2024

వి.రమేష్
కార్యనిర్వహణాధికారి, గ్రేడ్-1
సెల్: 70134 29148

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న మారం వెంకారెడ్డి


ప్రథమ విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కురిచేడు: మండలంలోని పొట్లపాడులో గుత్తికొండ రామయోగితాత ఆరాధన ఉత్సవాల సందర్భంగా మంగళవారం న్యూ కేటగిరి విభాగం బలప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ప్రారంభించారు. విభాగంలో 10 జతలు పోటీ పడ్డాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నుసుం గోవిందరెడ్డి, నుసుం మోపూరురెడ్డి, నుసుం గోవిందరెడ్డి, మారం వెంకటసుబ్బారెడ్డి, మారం రమణారెడ్డి, నక్కా వీర కోటేశ్వరరావు, నక్కా వీరబ్రహ్మం, నక్కా కొండయ్య, కొత్త బాలగురవయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు..

న్యూ కేటగిరిలో మొత్తం 10 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. పోటీల్లో పల్నాడు జిల్లా దుగ్గిరాల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి ఎడ్లు నిర్ణీయ సమతంలో 4436.10 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ.50,000 కైవసం చేసుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన మేకా ప్రతీక్ ఎడ్ల జత 4382 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.40 వేలు సాధించాయి. ముండ్లమూరు మండలం గన్నపాలెం గ్రామానికి చెందిన ఉమ్మారెడ్డి శ్రీవల్లి ఎడ్ల జత 3900 అడుగులు లాగి మూడో బహుమతి రూ.30,000 కైవసం చేసుకున్నాయి. పొట్లపాడు గ్రామానికి చెందిన మారం రమణారెడ్డి ఎడ్ల జత 3698.6 అడుగులు లాగి నాల్గవ బహుమతిని రూ.25,000 సాధించాయి.

పాలపళ్ల విభాగంలో విజేతలు..

పాలపళ్ల విభాగంలో 17 జతలు పోటీ పడగా 9 ఎడ్ల జతలు విజేతలుగా నిలిచాయి. మొదటి బహుమతి పల్నాడు జిల్లా పురుషోత్తపట్నంకు చెందిన షేక్ అబ్దుల్ సత్తార్, విజయవాడకు చెందిన వల్లభనేని మోహన్‌రావుల ఎడ్ల జత నిర్ణీత సమయంలో 4331.05 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ.40 వేలు అందుకున్నాయి. నంద్యాల జిల్లా కొణిదెల గ్రామానికి చెందిన దండు నరసింహుడు ఎడ్ల జత 4200 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.30 వేలు కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా పెదపరిమి గ్రామానికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్ల జత 4085.10 అడుగులు లాగి మూడో బహుమతి రూ.25000 సాధించాయి. పల్నాడు జిల్లా ఇక్కుర్తి గ్రామానికి చెందిన మాదబోయిన పోతురాజు ఎడ్ల జత 3900 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ.20 వేలు కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా నొస్సం గ్రామానికి చెందిన కొణిదెల హరినాథ్‌రెడ్డి ఎడ్ల జత 3880 అడుగులు లాగి 5వ బహుమతి రూ.15,000 సాధించాయి. గుంటూరు జిల్లా పాలడుగు గ్రామానికి చెందిన శాఖమూరి రామకోటయ్య, సరిపూడి గ్రామానికి చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావుల ఎడ్ల జత 3814 అడుగులు లాగి 6వ బహుమతి రూ.12000 కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్ల జత 3751 అడుగులు లాగి 7వ బహుమతి రూ.10 వేలను అందుకున్నాయి. పల్నాడు జిల్లా రామచంద్రాపురం గ్రామానికి చెందిన దండు అప్పారావు, బాపట్ల జిల్లా గంగపాలెం గ్రామానికి చెందిన రాయుడు సుబ్బారావుల ఎడ్ల ఎడ్ల జత 3689.07 అడుగులు లాగి 8వ బహుమతి రూ.7000 సాధించాయి. పల్నాడు జిల్లా గురజాల గ్రామానికి చెందిన లింగా అంజయ్య ఎడ్లజత 3600.06 అడుగులు లాగి 9వ బహుమతి రూ.5000లను కైవసం చేసుకున్నాయి.

ప్రజాగర్జన పాదయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

- లబ్ధిదారుడే స్టార్ కాంపెయినర్‌గా కావూరి జయకుమార్ పాదయాత్ర
- ఇచ్ఛాపురం నుంచి ఇడుపులపాయకు..


ఒంగోలు: లబ్ధిదారుడే స్టార్ కాంపెయినర్‌గా కావూరి జయకుమార్ చేపట్టనున్న ప్రజాగర్జన పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మంగళవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జగన్ మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాల్సిన అవసరం రాష్ట్రానికి ఉందని లబ్ధిదారుడైన కావూరి జయకుమార్ ఇచ్ఛాపురం నుంచి ఇడుపులపాయ వరకు పాదయాత్ర చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కావూరి జయకుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీ యాత్ర ఇచ్ఛాపురంలోని వైఎస్సార్ విజయ స్థూపం వద్ద ప్రారంభమై ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వరకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, నాగులుప్పలపాడు మండల జేసీఎస్ కన్వీనర్ ఇనగంటి పిచ్చిరెడ్డి, నాగులుప్పలపాడు మండల జేసీఎస్ కన్వీనర్ కుమ్మారి సుధాకర్, పార్టీ సీనియర్ నాయకులు ఓబుల్‌రెడ్డి, మద్దిపాడు మండల ఎంపీపీ వాకా గంగిరెడ్డి పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

ఇద్దరు విద్యార్థినులు అదృశ్యం

- కేసు నమోదు


మీనిగ చరిత


సోడా నారాయణమ్మ

రాచర్ల: పాఠశాలకు వెళ్లిన ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమయ్యారు. ఈ ఘటన మండలంలోని రాచర్లఫారం గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. రాచర్ల పంచాయతీ పరిధిలోని రాచర్లఫారం గ్రామానికి చెందిన మీనిగ చరిత అనే విద్యార్థిని రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. సోడా నారాయణమ్మ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఇద్దరు విద్యార్థినులు సోమవారం ఉదయం పాఠశాలలకు వెళుతున్నామని చెప్పి వెళ్లారు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పాఠశాలకు వెళ్లి విచారించినా రాలేదని తేలింది. దీంతో సోడా నారాయణమ్మ తల్లి వెంకటలక్ష్మి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై జి.కృష్ణపావని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు విద్యార్థుల ఆచూకీ తెలిస్తే మార్కాపురం డీఎస్పీ 91211 02180, గిద్దలూరు సీఐ 9121102187, రాచర్ల ఎస్సై 9121102191 నంబర్లకు తెలియజేయాలని ఎస్సై జి.కృష్ణపావని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు దర్శి విద్యార్థులు


విద్యార్థిని అభినందిస్తున్న పీడీ అంజిరెడ్డి

దర్శి: జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎస్ పవన్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 27, 28 తేదీల్లో అనంతపురం జిల్లా బత్తినపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఎస్ పవన్‌కుమార్, ఐ ఆనంద్ జయకుమార్, వై బ్రెట్లీ, ఎం ప్రేమ్‌కుమార్, ఏపీఎస్ ప్రసాద్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనపరిచిన పవన్‌కుమార్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ఫిబ్రవరి 9వ తేదీన ఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు జి.గురుప్రసాద్, పీడీ అంజిరెడ్డి అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ ఉచిత శిక్షణ మరియు ఉపాధి అవకాశాలు గ్రామీణ నిరుద్యోగ యువతి యువకులకు నాలుగు నెలల కాల వ్యవధిలో కంప్యూటర్ హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కోర్సులలో ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం, కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన సర్టిఫికెట్, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించబడును. Nihar Skill Education, Kadapa. Ph: 9063082227, 9966448807 [C-1249531]

COACHING

■ ఇంటర్ విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, Botany, Zoology, & ఆల్ సబ్జెక్ట్స్ సప్లిమెంటరీ కోచింగ్ ఇవ్వబడును. లాజిక్ అకాడమి, అంజయ్యరోడ్డు, ఒంగోలు. ✆ 72070 12758 [O-192157]

Real Estate

HOUSE FOR SALE

■ ఒంగోలు, కొత్తపట్నంరోడ్, రైల్వేస్టేషన్ ఫ్లై ఓవర్ ప్రక్కన, VDO's కాలనీ వెనుక, బ్యాంక్ కాలనీలో 26 గదులలో నిర్మించిన న్యూఫుల్ ఫినిషింగ్ 2 BHK ఇండిపెండెంట్ హౌస్ Rs.90 లక్షలకే అమ్మబడును. ✆ 90322 94769, 98487 64862. [O-192155]

Services

BUSINESS OFFER

■ స్త్రీ/పు. చిన్న పెట్టుబడితో ప్రాఫిట్ షేరింగ్ బిజినెస్ ద్వారా ప్రతి నెల 50,000/- ఆ పైన ఫిక్స్‌డ్ సంపాదన పొందండి. 7013203996, 7981283606 [H-801469]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824549]

MARRIAGE SERVICE

■ కల్యాణ ప్రాప్తిరస్తు రెడ్డి మ్యారేజ్ బ్యూరో ఒంగోలు S.W.E., Govt. ఎంప్లాయిస్, బిజినెస్ మెన్, 1వ, 2వ వివాహ సంబంధాలు కొరకు సంప్ర॥ ✆ 82735 14569, 84234 56189. [O-192151]

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ : ఒంగోలు
90102 02856
90102 02762

Wanted

■ M.S.W చేసిన & తెలుగు, ఇంగ్లీష్ కంప్యూటర్ ఆపరేటర్స్M/F మరియు అకౌంట్స్ క్లర్క్ M/F వెంటనే కావలెను. సం॥ శ్రీ భాస్కర్ ఏజెన్సీస్-ఒంగోలు. ✆ 94913 78456. [O-192073]

■ SUMAN-TV లో కందుకూరు బ్రాంచ్‌లో పనిచేయుటకు కెమెరామెన్స్-03, ఎడిటర్స్-02, న్యూస్ రీడర్స్ (F)-3, ఫోటోగ్రాఫర్స్-2 మొ॥ కావలెను. జీ॥12,000/--18,000/- సం॥ ✆ 6304922377 [O-192075]

■ ఒంగోలు,గుళ్ళాపల్లిలలోపనిచేయుటకుS.Oలు, సెక్యూరిటీగార్డ్స్ కావలెను. ఆన్‌డ్యూటీ మీల్స్+ రూం ఫ్రీ(గుళ్ళాపల్లిలో)జీ॥11,000-15వేలు సం॥✆9676649517,8179695848,9502760480. [O-192078]

■ మా షాపునందు లేడీ టెలీకాలర్స్ కంప్యూటర్ ఆపరేటర్స్ (మేల్) కావలెను. Con: శ్రీ బాపూజీ కాంప్లెక్స్, షాప్ నెం. 45, ఒంగోలు. ✆ 89214 11713 [OA-186]

■ విజయవాడలో ఇంటివద్దనే వుండి పేషెంట్‌లను /పెద్దవారిని చూసుకొనుటకు అనుభవం వున్న M/F కేర్ టేకర్స్ / నర్సులు కావలెను. రూమ్+భోజనం + మంచి జీతం ✆ 91608 35559, 78158 35561 [B-623]

■ యంగ్ ఇండియా కంపెనీలో ట్రైనీ మేనేజర్‌గా జాబ్ చేయుటకు 16 మంది కావలెను. అ: ఇంటర్ /డిప్లొమా/ITI వయస్సు: 30 లోపు. Income 9000 to 32000 ఫ్రీ రూం. ✆ 9866243104 [T-3012]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233769]

■ బిజినెస్ ప్రొమోటర్స్, మార్కెటింగ్, PRO's గ్రాఫిక్ డిజైనర్ స్టాఫ్ కావలెను. పార్ట్/ఫుల్ టైం/వర్క్ ఫ్రం హోమ్ జాబ్స్ కలవు. apdigital tech, Call / Whatsapp: 6309894919 [H-787922]

■ Wanted Teachers to Teach Nursery to 5th Class. Q:Degree / D.Ed / B.Ed+ Computer Knowledge. Send Biodata: sssmongole@gmail.com Cont: S.S.S.Mandir, E/M School,ongole ✆ 98851 85746 ఆయా కావలెను. [O-192080]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.